శిథిలావస్థలో డ్రెయిన్లు.. అడుగడుగునా అవస్థలు

- నిర్వహణపై నిర్లక్ష్యం
- రోడ్డుపై మురుగు చేరి గోతులు
- ముందుకు కదలని నీరు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరం పరిధిలో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. కొన్నిచోట్ల అసలు డ్రెయిన్లే ఉండవు. ఉన్నచోట నిర్వహణను పట్టించుకోరు. ప్రధాన కూడళ్లు, జంక్షన్లు, నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో డ్రెయినేజీలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. వీటికి పూర్తిస్థాయిలో మరమ్మతు చేయించాలని ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు స్పందించక పోవడంతో స్థానికులు డ్రెయిన్ గోతుల్లో ఇటుక, సిమెంట్ రాళ్లు వేయడం, కొన్ని చోట్ల రేకులు వంటివి కప్పుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లోనైనా డ్రెయిన్లకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

- నరసింహారావుపేటలోని ఓ ప్రముఖ హోటల్‌కు ఎదురుగా ఉన్న డ్రెయిన్ గొట్టం, ఆ ప్రాంతంలో పాడైన సంపును బాగుచేయకుండా, దానిపై తాత్కాలికంగా రేకును వేసి వదిలేశారు. ఈ గొయ్యిలో పడితే అంతే సంగతులంటూ వాహనచోదకులు గగ్గోలు పెడుతున్నారు.
- శాంతి నగర్ కలెక్టర్ బంగ్లా వెనుక వైపు రోడ్డులో మన్నా చర్చి ఎదురుగా ఉన్న డ్రెయినేజీ పైపు పగిలి మురుగు నీరు రోడ్డుపైకి వచ్చి పెద్ద గొయ్యి ఏర్పడింది. స్థానికులు ఈ గోతిని ఇటుక రాళ్లతో తాత్కాలికంగా పూడ్చారు. ఆ రాళ్లు పైకి లేచిపోయి తిరిగి గోయి కన్పిస్తుంది.
- శాంతి నగర్ ప్రాంతంలో అన్ని రోడ్లకూ డ్రెయిన్లు ఉన్నాయి. వీటి నిర్వహణను గాలికొదిలేయడంతో పలుచోట్ల డ్రెయిన్లు పూడిపోతున్నాయి. మెరక తోలిన చోట్ల మట్టి కొట్టుకొచ్చి డ్రెయిన్లలో కలుస్తుంది. కొన్నిచోట్ల చెత్తా చెదారం, సిల్టుతో డ్రెయిన్లు నిండి ఉన్నాయి.


ఎన్ఆర్‌పేటలోని ఓ హోటల్ ఎదురుగా డ్రెయిన్ గొయ్యిపై కప్పిన రేకు


మన్నా చర్చి సమీపంలో డ్రెయిన్ పగిలి ఏర్పడిన గొయ్యి


శాంతి నగర్ ఏడో రోడ్డులో పూడుకుపోయిన డ్రెయినేజీ

మొక్కుబడిగా నిర్వహణ



ఏలూరు నగరంలో డ్రెయిన్ల నిర్వహణ మొక్కుబడిగా ఉంది. డ్రెయిన్లలో పూడిక తీతలు, సిల్టు తొలగింపు వంటి కార్యక్రమాలకు లక్షలాది రూపాయాలు ఖర్చు చేసినట్టు రికార్డుల్లో చూపిస్తున్నారే తప్ప పూర్తిస్థాయిలో చేయడం లేదు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది డ్రెయిన్లను సక్రమంగా నిర్వహించాలి.

– బి.జగన్నాథం, ఏలూరు

తక్షణ చర్యలు చేపట్టాలి



నగరంలో పలుచోట్ల రోడ్లకు అడ్డంగా డ్రెయినేజీ పైపులు పగిలిపోయి పెద్దపెద్ద గోతులు పడుతున్నాయి. ఆయా మార్గాల్లో వాహనచోదకులు ఆదమరిస్తే ప్రమాదాలకు గురయ్యే పరిస్థితులు ఉన్నాయి. సంబంధిత అధికారులు తక్షణం డ్రెయినేజీలకు మరమ్మతులు చేసి ప్రమాదాల నివారణ చర్యలు తీసుకోవాలి.

– వెంపా నాగరాజు, మల్కాపురం

క్లుప్తంగా

వైభవంగా పవళింపు సేవ


స్వామి పవళింపు సేవలో పాల్గొన్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పోస్టల్ కాలనీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి 24వ శాంతి కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం విశేష పూజలు చేశారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకం అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం స్వామి వారికి పవళింపు సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు.

క్విజ్, వంటల పోటీలు


పదార్థాలను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సీఆర్ఆర్ మహిళా కళాశాలలో సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా సోమవారం విద్యార్థినిలకు క్విజ్, వంటల పోటీలు నిర్వహించారు. వంటల పోటీల్లో భాగంగా 20 మంది విద్యార్థినులు పలు నూతన వంటకాలను తయారు చేసి అబ్బురపరిచారు. తొలుత క్విజ్ పోటీల్లో మరో 20 మంది విద్యార్థినిలు పాల్గొన్నారు. మధ్యాహ్నం డిబేట్ పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో విజేతలను కళాశాల కరస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.సరళ శుభాకాంక్షలు తెలిపారు.

న్యాయవాద సదస్సులు సమాజ సేవకు దోహదం


సదస్సులో పాల్గొన్న సిస్టర్లు, ఫాదర్లు

పెదవేగి: న్యాయవాద సదస్సులు సమాజ సేవకు దోహదం చేస్తాయని స్టేట్ కోఆర్డినేటర్ విజయవాడ కథోలిక్ పీఠం ఫాదర్ బొందల స్లీవరాజు అన్నారు. సోమవారం ఆయన డెంటల్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో దేశం నలుమూలల నుంచి హాజరైన కథోలిక న్యాయవాదులు, గురువులు, సిస్టర్లు, సుపీరియర్లను అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. మూడు రోజులు పాటు జాతీయ న్యాయవాద సదస్సు నిర్వహణకు పూర్తి సహాయ సహకారాలు అందించిన ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు, నిర్వహణ బృందాన్ని ఫాదర్ స్లీవ రాజు అభినందించారు. దేశవ్యాప్తంగా మరిన్ని న్యాయవాద సదస్సులు నిర్వహించేందుకు తమ బృందం తోడ్పాటునందిస్తుందన్నారు.

15న జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ రాక

ఏలూరు (టూటౌన్): ఈనెల 14, 15 తేదీల్లో విజయవాడలో ఎస్సీ ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్టు ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు గరికిముక్కు సుబ్బయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగరాజు సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. తొలిరోజు విజయవాడలోని సిద్ధార్థ అకాడమి, రెండో రోజు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనాల్లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించే సమావేశాల్లో వేదిక హక్కులు, ఆశయాలపై చర్చిస్తామని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వనా, అతిథులుగా సామాజిక సమరసత వేదిక జాతీయ కన్వీనర్ కె.శ్యామ్ ప్రసాద్, సమరసత సేవా ఫౌండేషన్ అధ్యక్షులు తాళ్లూరి విష్ణువు, ఎస్సీ ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పరశురాం హాజరవుతారని పేర్కొన్నారు. వెల్లడించారు.

మహిళలకు తీవ్ర గాయాలు

ఏలూరు టౌన్: వేగంగా మోటారుసైకిల్‌పై వస్తున్న ముగ్గురు యువకులు స్కూటీని ఢీ కొట్టారు. స్కూటీపై ఉన్న వంగాయగూడెం ప్రాంతానికి చెందిన నాగమణి, సీతలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని నగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రమాద స్థలిలో బైక్‌ను వదిలేసి ముగ్గురు యువకులు పరారయ్యారు. జీజీహెచ్‌లో వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేశారు. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

హలో.. వద్దంటే వినరే!




ఏలూరు నగరంలో సెల్‌ఫోన్ మాట్లాడుతూ ద్విచక్రవాహనాలపై వెళుతున్న ప్రయాణికులు


ఫోన్ మాట్లాడుతూ రోడ్డు దాటుతున్న యువతి

ద్విచక్రవాహన ప్రమాదాల్లో సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేసేవే ఎక్కువ. కొందరు సెల్‌ఫోన్ మాట్లాడుతునే ద్విచక్రవాహనాలను డ్రైవ్ చేస్తున్నారు. మరి కొందరు ఫోన్లు మాట్లాడుకుంటూ రోడ్లపై వచ్చే వాహనాలను పట్టించుకోవడంలేదు. ఏలూరు నగరంలో సోమవారం సెల్‌ఫోన్ డ్రైవింగ్‌కు సంబంధించి చిత్రాలివి. సంబంధిత అధికారులు దీనిపై కఠినంగా వ్యవహరించాలని పలువురు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ / ఏలూరు



అదాని అక్రమాలపై విచారణకు డిమాండ్

ఏలూరు (టూటౌన్): సీపీఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా సోమవారం ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో పాత బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద డిమాండ్స్ డే సందర్భంగా నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో కోట్ల రూపాయల అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పారిశ్రామికవేత్త గౌతమ్ అదాని అక్రమాలపై పార్లమెంటరీ విచారణ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. అల్లర్లతో అట్టుడుకుతోన్న మణిపూర్ రాష్ట్రంలో ప్రధాని మోదీ పర్యటించాలన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ దేశంలో ధరలను అదుపు చేయడంలో, నిరుద్యోగ సమస్య పరిష్కారంలో విఫలమయ్యారని ఆరోపించారు. మోదీ తన హామీల అమలుకు తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పలూరి హేమ శంకర్, కురెళ్ల వరప్రసాద్, పుప్పాల కన్నబాబు, కొండేటి బేబి, తదితరులు పాల్గొన్నారు.


పాత బస్టాండ్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

ఉద్యోగుల సమస్యలపై ధర్నా

ఏలూరు (టూటౌన్): సమస్యల పరిష్కారం కోరుతూ ఏలూరు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సోమవారం భోజన విరామ సమయంలో కార్పొరేషన్ ఇంజినీరింగ్ ఉద్యోగ, సిబ్బంది ధర్నా చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) పిలుపులో భాగంగా చేపట్టిన ధర్నాలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు మాట్లాడారు. వాటర్ వర్క్స్, వాటర్ సప్లై, స్ట్రీట్ లైటింగ్, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, కంప్యూటర్ ఆపరేటర్స్, ఎలక్ట్రీషియన్స్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ, సిబ్బందికి నెలకు కనీస వేతనం రూ.32 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏలూరు కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఏడుగురు ఎన్ఎంఆర్‌లను రెగ్యులర్ చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో భర్తీ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, 2022 మార్చిలో ప్రమోషన్ ఇచ్చిన 9 మంది డ్రైవర్లకు ప్రమోషన్ వేతనం చెల్లించాలని, తదితర సమస్యలపై కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పుప్పాల కన్నబాబు, బి.నాగేశ్వరరావు బి.నారాయణరావు, ఎస్ఎన్‌వీ సుబ్బారావు, ఎం దుర్గారావు, బి.పెద్దిరాజు, సోమేశ్వరరావు, సీహెచ్ శ్రీనివాస్, సీహెచ్ హరినాథ్ బాబు తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేషన్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు, నాయకులు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	34
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	43
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	12
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	22
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	27
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	30
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	26
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	24
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	28
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	33
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	36	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	07, 10
బెండకాయలు	24	కంద	68
పచ్చిమిర్చి	30	బీట్‌రూట్	60
కాకర కాయలు	28-36	కీరా దోస	40
బీరకాయలు	32	ఫ్రెంచ్‌బీన్స్	100
బీరకాయలు (పందిరి)	44	అల్లం	70
క్యాబేజీ	36	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	64	పాలకూర	10
దొండకాయలు	28	చుక్కకూర	10
బంగాళదుంపలు	38	తోటకూర	10
ఉల్లిపాయలు	36-55	గోంగూర	07
గోరుచిక్కుడు	30	పుదీనా	05
దోసకాయలు	24	బఠాణీ	--
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	72
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

రజక వృత్తి చెరువులను కాపాడాలి

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రజక వృత్తిచెరువులను ఆక్రమణల నుంచి కాపాడాలని రజకజన సంఘ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర రజక సంఘ ప్రధాన కార్యదర్శి చిలకలపల్లి కట్లయ్య అన్నారు. ఏలూరులోని జిల్లా రజక సంఘం కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని సుమారు 200 చెరువులు ఆక్రమణకు గురయ్యాయని, ఐనా రజకులతో శిస్తు కట్టించుకుంటున్నారని వాపోయారు. నిడదవోలు నియోజకవర్గంలోని శెట్టిపేట గ్రామంలో రజకుల ఎకరం చెరువును ఆక్రమించి శాశ్వత కట్టడాలు చేస్తున్నారని, సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాడుతామని చెప్పారు. సమావేశంలో రజక నేతలు అత్తిలి రమేష్, పాలవలస అప్పలస్వామి, పాలవలస శ్రీను, శీలం నర్సయ్య, నారాయణపూర్ ప్రసాదు, పాలవలస రాజేష్, అత్తిలి శ్రీను, వట్లూరు మురళి, దేవరపల్లి సుబ్బయ్య, అవిడి సుబ్రహ్మణ్యం, శ్రీనివాసు, అత్తిలి కోటేశ్వరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కట్లయ్య

చురుగ్గా పైప్‌లైన్ విస్తరణ పనులు

దెందులూరు: పోతునూరు గ్రామం కొత్తూరు ప్రాంతంలో రూ. 50 లక్షల అంచనా వ్యయంతో ఐదున్నర కిలోమీటర్ల పొడవున పైప్ లైన్ నిర్మాణం చురుగ్గా కొనసాగుతోంది. దాదాపు 30 ఏళ్ల క్రితం వేసిన పైప్‌లైన్లు లోతైన ప్రాంతంలో ఉండడంతో కొత్తగా పైప్‌లైన్లు నిర్మాణం చేపట్టారు. ప్రధాన పైపులైన్ విస్తీర్ణంతో అంతర్గత రహదారులు వెంబడి 4 అంగుళాలు విస్తీర్ణంతో హెచ్‌డీ పైపులు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. నిర్మాణ పనులను మండల పంచాయతీలు విస్తరణ అధికారి పోతునూరు గ్రామ కార్యదర్శి షరీఫ్ పరిశీలించారు.

ఉపాధ్యాయుల గొంతుకై నిలవాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ విజయం సాధించిన పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి శాసన మండలిలో ఉపాధ్యాయుల గొంతుకై నిలవాలని ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జీజేఏ స్టీవెన్, ఏలూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాసగిరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో ఆశాభావం వ్యక్తం చేశారు. గోపిమూర్తి గెలుపుపై పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పువ్వుల ఆంజనేయులు, కేవీవీ సుబ్బారావు, రిటైర్డ్ ఉద్యోగులు సంఘ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు వీజీఎంవీఆర్ కృష్ణారావు వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశారు.

విద్యుత్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏపీ పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ ఈపీ డిస్కమ్ నూతన కార్యవర్గ ఎన్నిక ఈ నెల 8న విశాఖపట్నంలో జరిగిందని ఎన్నికల అధికారి, అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ జనరల్ పి.సన్యాసిరావు ఏలూరులో సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా కె.సత్యప్రసాద్, జి.జోగి నాయుడు, ఉపాధ్యక్షుడిగా ఎం శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా జీఎస్ఎస్ పట్నాయక్, జాయింట్ సెక్రటరీలుగా ఎస్ఎం అహ్మద్, జి.వీర్రాజు, టి.రాజ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎ.శ్రీను, బి.రఘు తదితరులు ఎన్నికయ్యారని తెలిపారు.

పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయింపు

ఏలూరు టౌన్: బ్యాటరీ సరిగా పనిచేయకపోవడంతో ఏలూరు రాణినగర్‌కు చెందిన సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి టూటౌన్‌లోని బ్యాటరీ షాపునకు సోమవారం వెళ్లి అడిగాడు. దీంతో షాపు నిర్వాహకులు, సుబ్రహ్మణ్యం, తన కుటుంబ సభ్యులు మధ్య గొడవ జరిగింది. వారు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వక ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలను పిలిచి మాట్లాడి కేసు నమోదు చేస్తామని కానిస్టేబుల్ తెలిపారు. ఈలోగా ఏలూరు జీజీహెచ్‌కు వెళ్లి ఎంఎల్‌సీ నమోదు చేయించుకుని మరోసారి స్టేషన్‌కు వచ్చారు. ఈ నేపథ్యంలో మద్యం సేవించి వచ్చిన బాధితుడు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌కు మధ్య గొడవ జరిగింది. దీంతో వారంతా టూటౌన్ స్టేషన్ బయట రోడ్డుపై బైఠాయించారు. వెంటనే సీఐ వైవీ రమణ వారిని స్టేషన్‌లోకి పిలిచి ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బ్యాటరీ షాపులోనూ, స్టేషన్‌లోనూ సీసీటీవీ పుటేజ్ పరిశీలించి కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు.

దోమలతో ప్రాణాంతక వ్యాధుల వ్యాప్తి


ర్యాలీ నిర్వహిస్తున్న అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు

పెదపాడు: ప్రపంచ జనాభా కంటే దోమల సంఖ్యే ఎక్కువని, ఎక్కువ వ్యాధులు దోమలు కుట్టడం వల్ల సంక్రమిస్తున్నాయని ప్రభుత్వ వైద్యాధికారి భారతి, అసిస్టెంట్ మలేరియా అధికారి జే గోవిందరావు తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టరు భారతి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో భాగంగా బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులకు దోమల వల్ల కలిగే వ్యాధులపై డాక్టరు భారతి అవగాహన కల్పించారు. ప్రపంచంలో 3,600 రకాల దోమలున్నాయని వాటిలో 3 రకాల దోమలు చాలా ప్రమాదకరమని చెప్పారు. వీటిలో ఆడ ఎడిస్ దోమ కుట్టడం వల్ల డెంగీ, చికెన్ గున్యా జ్వరాలు వస్తాయని ఆడ అనాఫిలస్ కట్టడం వల్ల మలేరియా వస్తుందని, ఆడ క్యూలెక్స్ దోమ వల్ల బోదకాలు, మెదడువాపు వస్తాయని తెలిపారు. ఎడిస్ దోమ, ఆడ ఎనాలిఫిస్ దోమ మంచినీటి నిల్వ ప్రాంతాల్లో పెరుగుతాయని, క్యూలెక్స్ దోమలు మురుగు నీరు నిల్వ ప్రాంతాల్లో పెరుగుతాయని తెలిపారు. వారానికి ఒకసారి మంచినీరు నిల్వ ఉండే ప్రాంతాలైన తొట్టెలు, డ్రమ్ములు, ఓవర్‌హెడ్ ట్యాంకులు వారానికి ఒకసారి కడిగి మూతలు పెట్టుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని తెలిపారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేసి ర్యాలీ నిర్వహించారు.